వాణిజ్య సిలిండర్‌పై రూ.30 తగ్గింపు

ఎన్నికల వేళ కేంద్రం నిర్ణయం

న్యూఢిల్లీ, ఏప్రిల్‌ 1: లోక్‌సభ ఎన్నికల ముంగిట కేంద్ర ప్రభుత్వం తాయిలాలు ప్రకటిస్తున్నది. ఇటీవలే గృహ వినియోగ వంట గ్యాస్‌ ధరను తగ్గించిన మోదీ సర్కారు.. తాజాగా వాణిజ్య సిలిండర్‌ ధరనూ తగ్గించింది. 19 కిలోల కమర్షియల్‌ గ్యాస్‌ సిలిండర్‌పై రూ.30.5 తగ్గిస్తూ సోమవారం నిర్ణయం తీసుకున్నది. ఈ మేరకు కేంద్ర చమురు సంస్థలు సోమవారం నోటిఫికేషన్‌ విడుదల చేశాయి. గత మూడు నెలల్లో కమర్షియల్‌ సిలిండర్‌ ధర తగ్గించడం ఇదే తొలిసారి కావడం గమనార్హం.

కేంద్ర దర్యాప్తు సంస్థలను నిలువరించండి

ఎన్నికల సంఘానికి టీఎంసీ విజ్ఞప్తి

న్యూఢిల్లీ, ఏప్రిల్‌ 1: ఎన్నికల ముందర ప్రతిపక్ష నేతల లక్ష్యంగా సీబీఐ, ఈడీ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలు దాడులను ముమ్మరం చేయడంపై మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్‌ కాంగ్రెస్‌ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. సార్వత్రిక ఎన్నికలు పూర్తయ్యేంత వరకు ప్రతిపక్ష పార్టీలు, నేతలపై కేంద్ర ఏజెన్సీలు చర్యలు తీసుకోకుండా అడ్డుకోవాలని కోరింది. టీఎంసీ నేత డెరిక్‌ ఓబ్రెయిన్‌ సహా పలువురు నేతలు ఈ మేరకు ఎన్నికల సంఘం ప్రధానాధికారిని కలిసి విజ్ఞప్తి చేశారు. విపక్షాలపై కేంద్ర దర్యాప్తు సంస్థలను ఉసిగొల్పుతూ కేంద్రం అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నదని వారు ఆరోపించారు. కేంద్ర సంస్థల డైరెక్టర్లను బదిలీ చేయాలని కోరారు. రాజ్యాంగ రక్షణలో భాగంగా ఈసీ చర్యలు తీసుకోవాలని అభ్యర్థించారు.

కర్ణాటకలో సీఎం మార్పు?

- సిద్ధరామయ్య, డీకే పరోక్ష సంకేతాలు
- సీఎంగా కొనసాగాలంటే.. లోక్‌సభ ఎన్నికల్లో భారీ మెజార్టీ ఇవ్వండి!
- అప్పుడు నన్నెవరూ టచ్‌ చేయలేరు
- నేను సీఎంగా ఉండాలా? వద్దా?
- వరుణలో సిద్ధరామయ్య వ్యాఖ్యలు
- నన్ను దృష్టిలో ఉంచుకొని అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించారు
- 'మీ కోరిక' అబద్ధం కాబోదు
- మండ్య సభలో శివకుమార్‌ వ్యాఖ్యలు

'నేను సీఎంగా కొనసాగాలా? వద్దా? లోక్‌సభ ఎన్నికల్లో వరుణలో కాంగ్రెస్‌ అభ్యర్థికి 60 వేల మెజార్టీ ఇవ్వండి. అప్పుడు నన్ను ఎవరూ టచ్‌ చేయలేరు. చేతులెత్తి అభ్యర్థిస్తున్నా..'
- వరుణలో సీఎం సిద్ధరామయ్య

'మీకు ఒక్కటే చెబుతున్నా.. గత ఏడాది అసెంబ్లీ ఎన్నికల్లో మీరు నన్ను దృష్టిలో ఉంచుకొని గెలిపించారు. మీ కోరిక అబద్ధం కాబోదు. మీరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు'
- మండ్యలో డీకే శివకుమార్‌

మైసూర్‌/మండ్య, ఏప్రిల్‌ 1: కర్ణాటకలో త్వరలో సీఎం మార్పు జరుగనున్నదా? అంటే అవుననే సమాధానం వినిపిస్తున్నది. సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌ తాజాగా చేసిన వ్యాఖ్యలు ఇందుకు బలాన్ని చేకూరుస్తున్నాయి. లోక్‌సభ ఎన్నికల తర్వాత లేదా అసెంబ్లీ టర్మ్‌ మధ్యలోనే నాయకత్వ మార్పు ఉంటుందని రాజకీయ వర్గాల్లో ఇప్పటికే జోరుగా చర్చ జరుగుతున్న వేళ.. తాజాగా సోమవారం వేర్వేరుగా ఎన్నికల ప్రచార సభల్లో పాల్గొన్న వీరిద్దరు చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. లోక్‌సభ ఎన్నికల తర్వాత కూడా ఎలాంటి అడ్డంకులు లేకుండా తానే సీఎంగా కొనసాగాలంటే.. తన వరుణ అసెంబ్లీ నియోజకవర్గంలో కాంగ్రెస్‌ పార్టీ ఎంపీ అభ్యర్థికి భారీ మెజార్టీ ఇవ్వాలని సిద్ధరామయ్య ప్రజలను కోరారు. 'నేను సీఎంగా కొనసాగాలా? వద్దా?.. వరుణలో కాంగ్రెస్‌ అభ్యర్థికి 60 వేల మెజార్టీ ఇవ్వండి' అంటూ సిద్ధరామయ్య ప్రజలను చేతులెత్తి అభ్యర్థించారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాలతో తన సీఎం పదవి భవిష్యత్తును ముడిపెడుతూ మాట్లాడారు. మరోవైపు మండ్యలో జరిగిన ఎన్నికల సభలో పాల్గొన్న డీకే శివకుమార్‌, గత ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తనను దృష్టిలో ఉంచుకొని కాంగ్రెస్‌కు ఓటేసిన ప్రజల కోరిక.. 'అబద్ధం కాబోదు' అంటూ వ్యాఖ్యానించారు.

చేతులెత్తి అభ్యర్థిస్తున్నా..

లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా వరుణలో నిర్వహించిన సభలో సీఎం సిద్ధరామయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరుణ నియోజకవర్గంలో కాంగ్రెస్‌ అభ్యర్థికి భారీగా మెజార్టీ ఇవ్వాలని ఓటర్లను కోరారు. '2019 లోక్‌సభ ఎన్నికల్లో ధ్రువనారాయణ్‌(కాంగ్రెస్‌ అభ్యర్థి) కేవలం 1,817 ఓట్లతో ఓడిపోయారు. గత ఏడాది అసెంబ్లీ ఎన్నికల్లో వరుణలో మీరు నాకు 48 వేల ఓట్ల మెజార్టీ ఇచ్చారు. అదేవిధంగా ఇప్పుడు లోక్‌సభ ఎన్నికల్లో మీరు కాంగ్రెస్‌ అభ్యర్థికి మన నియోజకవర్గంలో 60 వేల ఓట్ల ఆధిక్యం ఇస్తే, నేను సంతోషిస్తాను. అప్పుడు నన్ను ఎవరూ టచ్‌ చేయలేరు. నేను సీఎంగా ఉండాలా? వద్దా? చేతులెత్తి అభ్యర్థిస్తున్నా. గెలిచిన తర్వాత మీకు ధన్యవాదాలు చెప్పేందుకు మళ్లీ వస్తా' అని పేర్కొన్నారు. వరుణ అసెంబ్లీ నియోజకవర్గం చామరాజనగర్‌ లోక్‌సభ స్థానం పరిధిలోకి వస్తుంది. ఇక్కడి నుంచి కాంగ్రెస్‌ అభ్యర్థిగా రాష్ట్ర మంత్రి మహదేవప్ప కుమారుడు సునీల్‌ బోస్‌ పోటీ చేస్తున్నారు.

ఆందోళన చెందొద్దు..

మరోవైపు తన కమ్యూనిటీ వొక్కలిగల ప్రభావం అధికంగా ఉండే మండ్య జిల్లాలో జరిగిన ఎన్నికల ప్రచారంలో డిప్యూటీ సీఎం, రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్‌ పాల్గొన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వాలని ఓటర్లను కోరిన ఆయన.. గత అసెంబ్లీ ఎన్నికల్లో తనను దృష్టిలో పెట్టుకొని ఓటేసిన మీ కోరిక అబద్ధం కాబోదంటూ ప్రజలకు హామీ ఇచ్చారు. 'నేను మీకు ఒక్కటి చెప్పదలచుకొన్నా.. నన్ను దృష్టిలో ఉంచుకొని, గత అసెంబ్లీ ఎన్నికల్లో మండ్య జిల్లాల్లో కాంగ్రెస్‌కు అధిక సీట్లు ఇచ్చారు. మీ కోరిక అబద్ధం కాబోదు. మీరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు' అని శివకుమార్‌ పేర్కొన్నారు. కాగా, గత ఏడాది అసెంబ్లీలో కాంగ్రెస్‌ గెలిచిన తర్వాత, ముఖ్యమంత్రి పదవి కోసం డీకే తీవ్ర ప్రయత్నాలు చేసిన విషయం తెలిసిందే. అయితే డీకేకు నచ్చజెప్పిన పార్టీ అధిష్ఠానం.. సిద్ధరామయ్యకు సీఎం పోస్టు ఇచ్చింది. 'రెండున్నర ఏండ్ల తర్వాత సీఎం మార్పు' అనే ఫార్ములా ఆధారంగానే హైకమాండ్‌ ఇద్దరి మధ్య రాజీ కుదుర్చిందనే వార్తలు అప్పట్లో వెలువడ్డాయి.

పశ్చిమ యూపీలో పాగా వేసేదెవరు?

- 16 సీట్లతో కీలకమైన ప్రాంతం
- ప్రతి లోక్‌సభ నియోజకవర్గంలో 19 నుంచి 42 శాతం ముస్లింలు
- ముస్లిం ఓట్ల చీలికపై బీజేపీ ఆశలు
- మెజార్టీ సీట్లపై సమాజ్‌వాదీ కన్ను



లక్నో : దేశంలో మూడోసారి అధికారంలోకి రావాలని పట్టుదలగా ఉన్న బీజేపీకి ఉత్తరప్రదేశ్‌పై చాలా ఆశలే ఉన్నాయి. 80 లోక్‌సభ స్థానాలున్న ఈ రాష్ట్రంలో పట్టు నిలుపుకోవడం బీజేపీకి చాలా అవసరం. అయితే, పశ్చిమ యూపీ మాత్రం కమలం పార్టీని కలవరానికి గురి చేస్తున్నది. 16 లోక్‌సభ స్థానాలు ఉన్న ఈ ప్రాంతంలో ముస్లింల ఓట్లు గెలుపోటములను ప్రభావితం చేసే స్థాయిలో ఉన్నాయి. ప్రతి నియోజకవర్గంలో 19 నుంచి 42 శాతం వరకు ముస్లిం ఓట్లు ఉన్నాయి. కాబట్టి, ముస్లిం ఓట్ల చీలికపై ఇక్కడ బీజేపీ ఆశలు పెట్టుకున్నది. మరోవైపు ముస్లిం ఓట్లు గంపగుత్తగా పొందితే ఈ 16 స్థానాలను దక్కించుకోవచ్చని సమాజ్‌వాదీ(ఎస్పీ) – కాంగ్రెస్‌ కూటమి భావిస్తున్నది.

విడిగా పోటీ చేస్తున్న ఎస్పీ, బీఎస్పీ

2014 ఎన్నికల్లో పశ్చిమ యూపీలోని మొత్తం 16 స్థానాలనూ బీజేపీ క్లీన్‌స్వీప్‌ చేసింది. ఆ ఎన్నికల్లో ఎస్పీ, బీఎస్పీ, కాంగ్రెస్‌ వేర్వేరుగా పోటీ చేశాయి. కానీ, 2019కి వచ్చే నాటికి రాజకీయ సమీకరణాలు మారాయి. ఎస్పీ, బీఎస్పీ, ఆర్‌ఎల్డీ పొత్తు పెట్టుకోవడంతో ముస్లింలు ఏకపక్షంగా ఈ కూటమి వైపు నిలిచారు. దీంతో 16 సీట్లలో బీజేపీ కేవలం 9 మాత్రమే గెలుచుకోగలిగింది. బీఎస్పీ 4, ఎస్పీ 3 సీట్లు గెలుచుకున్నాయి. ఇప్పుడు మళ్లీ పరిస్థితులు మారాయి. బీఎస్పీ ఒంటరిగా పోటీ చేస్తున్నది. జయంత్‌ సింగ్‌ చౌదరి నేతృత్వంలోని ఆర్‌ఎల్డీ.. బీజేపీతో జతకట్టింది. కాంగ్రెస్‌తో కలిసి ఎస్పీ పోటీ చేస్తున్నది. ఇలా గత ఎన్నికల్లో కలిసి పోటీ చేసి బీజేపీకి గట్టి పోటీ ఇచ్చిన మూడు పార్టీలూ ఈసారి మూడు దిక్కులయ్యాయి.

ముస్లిం ఓట్లు చీలే అవకాశం

బీఎస్పీ, ఎస్పీ విడిగా పోటీ చేయడం వల్ల ముస్లిం ఓట్లలో చీలిక వచ్చే అవకాశం ఉన్నది. పైగా ముస్లింల ఓట్లు ఎక్కువగా ఉన్న మెజారిటీ స్థానాల్లో ఎస్పీ, బీఎస్పీ రెండూ ముస్లింలనే అభ్యర్థులుగా నిలుపుతున్నాయి. ఇది కూడా ముస్లింల ఓట్ల చీలికకు కారణం కావొచ్చు. ఇక, అప్నాదల్‌(కే)తో పొత్తు పెట్టుకొని ముస్లింలు మెజారిటీగా ఉన్న స్థానాల్లో పోటీ చేయాలని ఎంఐఎం పార్టీ కూడా ప్రణాళికలు రచిస్తున్నది. బీజేపీ కూడా ముస్లిం ఓట్లను పెంచుకోవాలని భావిస్తున్నది. ముఖ్యంగా పస్మంద ముస్లింల ఓట్లు పొందేందుకు ప్రయత్నిస్తున్నది. పూర్తిగా ముస్లిం ఓటర్లు ఉన్న పోలింగ్‌ బూత్‌లతో గత ఎన్నికల్లో బీజేపీ 10 లోపే ఓట్లు వచ్చినవి చాలా ఉన్నాయి. ఇలాంటి బూత్‌లలో ఈసారి కనీసం 50 ఓట్లు పొందాలనే లక్ష్యం పెట్టుకొని బీజేపీ బూత్‌ కమిటీలు పని చేస్తున్నాయి. ఇలా రెండుమూడు పార్టీల మధ్య ముస్లిం ఓట్లు కనుక చీలితే అది బీజేపీకి కలిసి వచ్చే అవకాశం ఉంది. ఒకవేళ ముస్లిం ఓట్లు గంపగుత్తగా ఎస్పీ – కాంగ్రెస్‌ కూటమికి లేదా బీఎస్పీకి పడితే బీజేపీకి పశ్చిమ యూపీలో మెరుగైన ఫలితాలు రాకపోవచ్చు.

పారదర్శక ఎన్నికలకు అడ్డంకులు

- ఈడీ, ఐటీ ఇటీవలి చర్యలే ఇందుకు నిదర్శనం
- విపక్ష పార్టీల నేతలపై కేసులు, నోటీసులు ఇందులో భాగమే
- కేంద్ర ఎన్నికల సంఘం మాజీ ప్రధాన కమిషనర్ల ఆగ్రహం
- ఈ విషయంలో ఎన్నికల సంఘం జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి

(స్పెషల్‌ టాస్క్‌ బ్యూరో)

హైదరాబాద్‌, ఏప్రిల్‌ 1 (నమస్తే తెలంగాణ): పారదర్శక ఎన్నికల నిర్వహణకు అడ్డంకులు సృష్టించే చర్యలు ఇటీవలి కాలంలో ఎక్కువయ్యాయని ఎన్నికల సంఘం మాజీ ప్రధాన అధికారులు (సీఈసీ) ఆందోళన వ్యక్తం చేశారు. విపక్ష పార్టీ నేతల ఇండ్లపై ఎన్‌ఫోర్స్‌మెంట్‌ డైరెక్టరేట్‌ (ఈడీ) దాడులు, కీలక నాయకులకు ఆదాయపు పన్ను శాఖ (ఐటీ) నోటీసులు ఇవ్వడం, ఖాతాల స్తంభన ఇందులో భాగమేనని అభిప్రాయపడ్డారు. ఎన్నికల సమయంలో ఇది సహేతుకమైన చర్య అనిపించుకోబోదని, ఈ విషయంలో ఈసీ వెంటనే జోక్యం చేసుకోవాల్సిన అవసరమున్నదన్నారు. ఈ మేరకు జాతీయ పత్రిక ఇండియన్‌ ఎక్స్‌ప్రెస్‌తో మాజీ సీఈసీ ఎస్‌వై ఖురేషీతో పాటు పేరు బయటపెట్టడానికి ఇష్టపడని మరో ఇద్దరు మాజీ సీఈసీలు మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల ముందు బీఆర్‌ఎస్‌ ఎమ్మెల్సీ కే కవిత, ఆప్‌ జాతీయ కన్వీనర్‌ కేజ్రీవాల్‌ తదితర నేతలపై ఈడీ కేసులు పెట్టడం, కాంగ్రెస్‌కు ఐటీ నోటీసులు జారీ చేయడం, ఖాతాలను ఫ్రీజ్‌ చేయడం తెలిసిందే. ఈ క్రమంలో మాజీ సీఈసీల వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకొన్నాయి.

నిధులెక్కడ నుంచి వస్తాయి?

మేం సీఈసీలుగా ఉన్నప్పుడు ఇలాంటివి ఎప్పుడూ జరుగలేదు. ఖాతాలను స్తంభింపజేస్తే.. ప్రచారానికి పార్టీలకు నిధులెక్కడ నుంచి వస్తాయి? దీనిపై ఈసీ, సీబీడీటీతో చర్చించాలి.
- (పేరు చెప్పడానికి ఇష్టపడని) ఇద్దరు మాజీ సీఈసీలు

వాయిదాతో భారీ నష్టమైతే జరుగదు కదా!

ఎన్నికల ప్రచార సమయంలోనే విపక్ష నేతలకు ఈడీ, ఐటీ నోటీసులు ఇవ్వడమేంటి? పోలింగ్‌ పూర్తైన తర్వాత కూడా ఇవన్నీ చేయవచ్చు కదా? సోదాలు, నోటీసుల వంటి పనులను తాత్కాలికంగా వాయిదా వేస్తే.. సరిదిద్దుకోలేని నష్టం వాటిల్లుతుందని నేననుకోవట్లేదు. ఈ చర్యలపై ఈసీ జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఉన్నది.
- మాజీ సీఈసీ ఎస్‌వై ఖురేషీ

వీవీప్యాట్ల లెక్కింపుపై ఈసీకి సుప్రీంకోర్టు నోటీసు

న్యూఢిల్లీ: ఎన్నికల్లో వందశాతం వీవీప్యాట్ల లెక్కింపును తప్పనిసరి చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై స్పందన తెలియజేయాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని, కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు సోమవారం ఆదేశించింది. న్యాయవాది, ఉద్యమకారుడు అరుణ్‌ కుమార్‌ అగర్వాల్‌ దాఖలు చేసిన ఈ పిటిషన్‌ను ఇదే అంశంపై గతంలో దాఖలైన పిటిషన్లతో పాటు విచారణ జరపాలని నిర్ణయించింది. ప్రస్తుతం ఒక నియోజకవర్గంలో ర్యాండమ్‌గా ఎంపిక చేసిన ఐదు ఈవీఎంలతో వీవీప్యాట్‌ స్లిప్పులను సరిపోల్చుతున్నారు. అలా కాకుండా వంద శాతం వీవీప్యాట్లను లెక్కించాలని పిటిషనర్‌ కోర్టును కోరారు.

బీజేపీకి 'నో ఎంట్రీ'!

మొదటిపేజీ తరువాయి...

నేతలు రావొద్దని, ప్రచార కార్యక్రమాలు చేపట్టవద్దని భటిండా, సంగ్రూర్‌ జిల్లాల్లోని భారూ, మాన్సా, మండికలాన్‌ తదితర గ్రామాల శివారుల్లో పలు బ్యానర్లు, బోర్డులను గ్రామస్థులు ఏర్పాటు చేశారు. 'రైతు సమస్యలపై ఢిల్లీలో నిరసనలు చేపట్టాలను కొంటే, మమ్మల్ని రానివ్వట్లేదు. అందుకే, మిమ్మల్నీ మా ఊళ్లలోకి రానివ్వం', 'మీకు (బీజేపీ) ఓటేస్తే, మళ్లీ నల్లచట్టాలను తీసుకొస్తారు', 'శంభూ సరిహద్దుల్లో శాంతియుత నిరసనలు చేస్తున్న రైతులపై కాల్పులు జరిపారు. ఈ ఘటనలో 19 ఏండ్ల యువరైతు శుభ్‌కరణ్‌ సింగ్‌ మరణించాడు. అయినా ప్రభుత్వం పట్టించుకోలేదు. ఈ దారుణానికి పాల్పడ్డ మీరు మా గ్రామాల్లోకి రావొద్దు' అని బ్యానర్లు, బోర్డుల్లో రాసి ఉంది.

రద్దవుతున్న సభలు

రైతుల నిరసనలు ఉధృతమవుతున్న నేపథ్యంలో పలు ఎన్నికల సభలను బీజేపీ నేతలు రద్దు చేస్తుండటం కూడా కనిపిస్తున్నది. ఎన్నికల ప్రచారంలో భాగంగా గత నెల 24న భటిండాలో 'బీజేపీ మహోత్సవ్‌' పేరిట సభ నిర్వహించాలనుకొన్నారు. బీజేపీ పంజాబ్‌ రాష్ట్ర అధ్యక్షుడు సునీల్‌ జాఖర్‌ హాజరవ్వాల్సి ఉంది. అయితే, రైతులు, స్థానికుల నుంచి వ్యతిరేకత రావడంతో ఆ సభను బీజేపీ అధిష్ఠానం రద్దు చేసింది. మరో సభ కూడా ఇలాగే రద్దైనట్టు సమాచారం. బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా సంయుక్త కిసాన్‌ మోర్చా (ఎస్కేఎం) నేతలు కూడా పెద్దయెత్తున కార్యక్రమాలు చేపడుతున్నారు.

వచ్చే మూడు నెలలూ భగభగలే

ఐఎండీ హెచ్చరిక

న్యూఢిల్లీ, ఏప్రిల్‌ 1: ఈ ఏడాది వేసవిలో ఎండలు మండిపోనున్నాయని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) హెచ్చరిస్తున్నది. సార్వత్రిక ఎన్నికల వేడికి భానుడి సెగలు కూడా తోడవ్వటంతో జనం ఉక్కిరిబిక్కిరి కాక తప్పదు. ఏప్రిల్‌ నుంచి జూన్‌ మధ్యలో తీవ్ర ఉష్ణోగ్రతలు నమోదవుతాయని ఐఎండీ తెలిపింది. ఏప్రిల్‌ నెలలో సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశమున్నదని పేర్కొన్నది. ఐఎండీ హెచ్చరికల నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కేంద్ర మంత్రి కిరణ్‌ రిజుజు కోరారు. మన దేశంలో అత్యధిక జనాభా ఉన్నది కాబట్టి పెరిగే ఉష్ణోగ్రతలను ఎదుర్కోవటం ఓ సవాల్‌ లాంటిందని తెలిపారు. దీన్ని ఎదుర్కోవటానికి దేశం ముందుగానే సిద్ధం కావాలని మీడియా సమావేశంలో చెప్పారు.

సిరియాలోని ఇరాన్‌ ఎంబసీపై ఇజ్రాయెల్‌ దాడి

ఇరానియన్‌ కమాండర్‌ సహా 8 మంది మృతి

న్యూఢిల్లీ, ఏప్రిల్‌ 1: సిరియా రాజధానిలోని ఇరాన్‌ రాయబార కార్యాలయ భవనంపై ఇజ్రాయెల్‌ సోమవారం దాడులకు దిగింది. ఈ దాడుల్లో ఇరాన్‌ ఎంబసీ అనెక్స్‌లో సీనియర్‌ ఇరానియన్‌ కమాండర్‌ సహా 8 మంది మృతిచెందినట్టు వార్‌ మానిటర్‌ నివేదిక వెల్లడించినట్టు స్థానిక మీడియా తెలిపింది. డమాస్కస్‌లోని మజ్జే పరిసరాల్లోని ఇరాన్‌ కాన్సులేట్‌ భవనాన్ని ఇజ్రాయెల్‌ లక్ష్యంగా చేసుకున్నట్టు సిరియా అధికారిక వార్తా సంస్థ సనా తెలిపింది. బాంబు దాడి జరిగిన ప్రదేశాన్ని వార్తా ఏజెన్సీలు ధ్రువీకరించాయి. దాడిలో రాయబార కార్యాలయం పక్కన ఉన్న అనుబంధ భవనం నేలమట్టమైంది. ఈ దాడుల్లో ఇరాన్‌ కమాండర్‌ మహ్మద్‌ రెజా జాహెదీ మరణించినట్టు ప్రముఖ వార్తా సంస్థ రాయిటర్‌ వెల్లడించింది. తాజా దాడిపై ఇరాన్‌ నుంచి ఎలాంటి స్పందన రాలేదు.

పెట్రో వాహనాలకు 100% స్వస్తి!

కేంద్ర మంత్రి గడ్కరీ కీలక వ్యాఖ్యలు



నాగ్‌పూర్‌, ఏప్రిల్‌ 1: దేశంలో డీజిల్‌, పెట్రోల్‌ కార్ల వాడకానికి పూర్తిగా స్వస్తి పలకాలని గతంలో వ్యాఖ్యానించిన కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్‌ గడ్కరీ మరోసారి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తాను చెప్పింది సాధించడం కష్టమే కానీ... అసాధ్యం మాత్రం కాదన్నారు. 'వంద శాతం' సాధ్యమేనని విశ్వాసం వ్యక్తం చేశారు! ప్రజలు, పరిశ్రమల ఆలోచన ధోరణిలో వస్తున్న మార్పులను ఇందుకు ఉదహరించారు. ఇందుకోసం హైబ్రిడ్‌ వాహనాలపై జీఎస్టీని తగ్గించాలని ఆయన కోరారు. పీటీఐ ఇంటర్వ్యూలో ఆయన పలు విషయాలు వెల్లడించారు. 'మన పొరుగు ఇండ్లలో ఇప్పుడు చాలా ఎలక్ట్రిక్‌ కార్లు కనిపిస్తున్నాయి. ఇది అసాధ్యం అనుకున్న ప్రజలే తమ ఆలోచనను మార్చుకొన్నారు' అని గడ్కరీ అన్నారు. టాటా, అశోకా లేల్యాండ్‌ కంపెనీలు హైడ్రోజన్‌తో నడిచే ట్రక్కులను ప్రవేశపెట్టాయని, ఎల్‌ఎన్జీ లేదా సీఎన్జీతో నడిచే ట్రక్కులు కూడా ఉన్నాయని గడ్కరీ తెలిపారు. అయితే పెట్రో వాహనాలకు పూర్తిగా స్వస్తి పలకడం ఎప్పుడు సాకారమవుతుందో ఆయన కచ్చితంగా చెప్పలేకపోయారు.

వన్‌ వెహికిల్‌.. వన్‌ ఫాస్టాగ్‌

అమల్లోకి కొత్త నిబంధన



న్యూఢిల్లీ, ఏప్రిల్‌ 1: కేంద్ర ప్రభుత్వం అధీనంలోని నేషనల్‌ హైవేస్‌ అథారిటీ ఆఫ్‌ ఇండియా(ఎన్‌హెచ్‌ఏఐ) తీసుకొచ్చిన 'వన్‌ వెహికిల్‌, వన్‌ ఫాస్టాగ్‌' నిబంధన సోమవారం నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చిందని సీనియర్‌ అధికారి ఒకరు వెల్లడించారు. ఒకే ఫాస్టాగ్‌ను పలు వాహనాలకు వినియోగించడం లేదా ఒక వాహనానికి పలు ఫాస్టాగ్‌లను లింక్‌ చేస్తున్న ఘటనలకు చెక్‌ పెట్టేందుకు ఎన్‌హెచ్‌ఏఐ ఈ కొత్త విధానం ప్రవేశపెట్టినట్టు తెలిపారు. ఇక నుంచి మల్టిపుల్‌ ఫాస్టాగ్‌లు పనిచేయవని, ఒక వాహనానికి పలురకాల ఫాస్టాగ్‌లు ఉన్న వాళ్లు ఏప్రిల్‌ 1 నుంచి వాటిని ఉపయోగించుకోలేరని ఆ అధికారి పీటీఐతో మాట్లాడుతూ పేర్కొన్నారు. పేటీఎం ఫాస్టాగ్‌ యూజర్లు ఎదుర్కొంటున్న పలు సమస్యల కారణంగా ఈ 'వన్‌ వెహికిల్‌, వన్‌ ఫాస్టాగ్‌' నిబంధన అమలు డైడ్‌లైన్‌ను మార్చి చివరి వరకు పొడిగించారు. పేటీఎం పేమెంట్స్‌ బ్యాంక్‌ కస్టమర్లు, మర్చంట్లు మార్చి 15లోగా తమ ఖాతాలను ఇతర బ్యాంకులకు మార్చుకోవాలని ఆర్బీఐ ఇదివరకే సూచించిన సంగతి తెలిసిందే.

టేకాఫ్‌ ఆలస్యమైతే.. అలా చేయొచ్చట!

విమాన ప్రయాణికులకు కొత్త గైడ్‌లైన్స్‌

న్యూఢిల్లీ, ఏప్రిల్‌ 1: విమాన ప్రయాణికులకు బ్యూరో ఆఫ్‌ సివిల్‌ ఏవియేషన్‌ సెక్యూరిటీ (బీసీఏఎస్‌) శుభవార్త చెప్పింది. ఇకపై విమానం కదలటం ఆలస్యమైతే సీట్లోనే గంటల తరబడి అతుక్కుని పోవాల్సిన పనిలేదట. ఎక్కువ సేపు వేచి చూడాల్సిన అవసరం లేకుండా ఎయిర్‌పోర్ట్‌ డిపార్చర్‌ గేట్‌ నుంచి ప్రయాణికులు వెళ్లిపోవచ్చని తెలిపింది. ఇందుకోసం కొత్త మార్గదర్శకాలను విడుదల చేసింది. ఎయిర్‌పోర్ట్‌ రద్దీ, పెరుగుతున్న విమానాల ఆలస్యాల నేపథ్యంలో ఈ మార్గదర్శకాలను జారీ చేసినట్టు బీసీఏఎస్‌ డైరెక్టర్‌ జనరల్‌ జుల్ఫికర్‌ హసన్‌ సోమవారం తెలిపారు. ఇవి ఇప్పుడు అమల్లోకి వచ్చాయి. కొత్త గైడ్‌లైన్స్‌ అమలు చేయటానికి విమానాశ్రయ నిర్వాహకులు స్క్రీనింగ్‌తో సహా మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన అవసరముందని హసన్‌ చెప్పారు. ప్రయాణికులను దింపే నిర్ణయం సంబంధిత విమానయాన సంస్థలు, భద్రతా ఏజెన్సీలు తీసుకుంటాయి.

అన్నింట్లో జోక్యం వద్దు

- దేశ భద్రత, ఆర్థిక నేరాలపైనే దృష్టిపెట్టాలి
- తనిఖీ అధికారాలు, గోప్యతా హక్కుల మధ్య సమతుల్యత అవసరం
- వ్యక్తిగత పరికరాల అనవసర జప్తు తగదు
- కేంద్ర దర్యాప్తు సంస్థలకు సీజేఐ సూచన

న్యూఢిల్లీ, ఏప్రిల్‌ 1: కేంద్ర దర్యాప్తు సంస్థలకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్‌ డీవై చంద్రచూడ్‌ కీలక సూచనలు చేశారు. గత కొన్నేండ్లుగా సీబీఐ వంటి కేంద్ర ఏజెన్సీలు అనేక రకాల కేసుల్లో భాగమవుతుండటాన్ని ప్రస్తావించిన సీజేఐ.. కేసుల ఎంపికలో శ్రద్ధ వహించాలని, తద్వారా దర్యాప్తు సంస్థల సామర్థ్యాన్ని మెరుగుపరచొచ్చని చెప్పారు. ప్రధానంగా జాతీయ భద్రత, దేశ ఆర్థిక వ్యవస్థకు, శాంతి భద్రతలకు ముప్పు కలిగించే నేరాలపైనే దృష్టిసారించాలని సూచించారు. సీబీఐ రైజింగ్‌ డే సందర్భంగా డీపీ కోహ్లీ 20వ స్మారక కార్యక్రమంలో సీజేఐ జస్టిస్‌ చంద్రచూడ్‌ ప్రసంగించారు. ఈ సందర్భంగా సాంకేతికత నేరాలను ఏవిధంగా మార్చింది.. దర్యాప్తు సంస్థలు ప్రస్తుతం ఎదుర్కొంటున్న పలు క్లిష్టమైన సవాళ్లపై ఆయన మాట్లాడారు. అవినీతి వ్యతిరేక దర్యాప్తు సంస్థ అయిన సీబీఐని దాని పరిధిని మించి వివిధ క్రిమినల్‌ కేసులను దర్యాప్తు చేయాలని కోరుతున్నారని, ఇది ఆ సంస్థపై మోయలేని భారాన్ని మోపుతున్నదని పేర్కొన్నారు. సీబీఐ ఎక్కువగా డిప్యుటేషన్‌ ఉద్యోగులపైనే ఆధారపడుతుంటాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో దర్యాప్తు సంస్థలు కేసుల ఎంపికపై దృష్టిపెట్టాలని, దేశ భద్రతకు ముప్పు కలిగించే, దేశానికి వ్యతిరేకంగా జరిగే ఆర్థిక నేరాలకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు.

న్యాయవ్యవస్థ ఆధునీకరణలో కీలక ముందడుగు..

సోదాలు చేసేందుకు, పరికరాల స్వాధీనం చేసుకునేందుకు దర్యాప్తు సంస్థలకు ఉండే అధికారాలు, వ్యక్తుల గోప్యతా హక్కుల మధ్య సున్నితమైన సమతుల్యత అవసరమని సీజేఐ చంద్రచూడ్‌ అభిప్రాయపడ్డారు. వ్యక్తిగత పరికరాలను అనవసరంగా జప్తు చేయడం తగదని స్పష్టంచేశారు. కాగా, కేంద్ర ప్రభుత్వం ఇటీవల పార్లమెంట్‌లో ఆమోదించిన కొత్త నేర న్యాయ చట్టాలను సీజేఐ ప్రశంసించారు. న్యాయ వ్యవస్థను ఆధునీకరించడంలో ఇది ఒక కీలకమైన అడుగు అని పేర్కొన్నారు.

కృత్రిమ మేధ.. గేమ్‌ ఛేంజర్‌

కేసులకు సంబంధించి ఎఫ్‌ఐఆర్‌ నమోదు నుంచి దర్యాప్తు ప్రక్రియనంతటినీ డిజిటలైజ్‌ చేయాలని సీజేఐ సూచించారు. భారీ సంఖ్యలో కేసులు ఉన్నందున, జాప్యాన్ని నివారించేందుకు టెక్నాలజీని ఉపయోగించుకోవాల్సిన అవసరం ఉన్నదని అభిప్రాయపడ్డారు. మనం ఎదుర్కొంటున్న పలు సవాళ్లను అధిగమించడంపై నేర న్యాయ అడ్మినిస్ట్రేషన్‌కు చెందిన అన్ని విభాగాలు వర్క్‌షాప్‌లు నిర్వహించాలని సూచించారు. నిర్మాణాత్మక సంస్కరణలు చేపట్టడం ద్వారా దర్యాప్తు సంస్థలను అప్‌గ్రేడ్‌ చేయాలని అన్నారు. కృత్రిమ మేధ(ఏఐ)ను గేమ్‌ ఛేంజర్‌గా పేర్కొన్న సీజేఐ.. ఉత్తమ ఫలితం కోసం ఏఐను తప్పనిసరిగా ఉపయోగించుకోవాలని సూచించారు.

రుణాలపై కేంద్రం ఆంక్షలు .. రాజ్యాంగ ధర్మాసనానికి కేరళ కేసు

రాష్ర్టాల అప్పులపై కేంద్ర ప్రభుత్వం ఆంక్షలు విధించడాన్ని సవాల్‌ చేస్తూ కేరళ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు సోమవారం ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనానికి బదిలీ చేసింది. రాష్ర్టాల అప్పులపై పరిమితులు విధించడం ద్వారా, రాష్ర్టాల హక్కులు, అధికారాల్లో కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుంటున్నదని కేరళ ప్రభుత్వం చేసిన వాదనలను జస్టిస్‌లు సూర్యకాంత్‌, కేవీ విశ్వనాథన్‌లతో కూడిన బెంచ్‌ పరిశీలించింది. అనంతరం కేసును విస్తృత ధర్మాసనానికి నివేదిస్తున్నట్టు తెలిపింది. ఆర్టికల్‌ 131 ప్రకారం కేరళ ప్రభుత్వం ఈ కేసును దాఖలు చేసింది. రాజ్యాంగంలోని ఈ ఆర్టికల్‌ కేంద్ర, రాష్ర్టాల మధ్య తలెత్తిన ఏదైనా వివాదంలో అసలు అధికార పరిధిని సుప్రీంకోర్టు తేలుస్తుందని వివరిస్తుంది.

ఎన్నికల తర్వాతే కొత్త టోల్‌ రేట్లు

న్యూఢిల్లీ, ఏప్రిల్‌ 1: హైవేలపై ప్రయాణించే వాహనదారులకు విధించే టోల్‌ రేట్లపై ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. పెరిగిన టోల్‌ రేట్లు ఈసారి ఎన్నికల తర్వాతే అమలులోకి రానున్నాయి. సాధారణంగా కొత్త రేట్లు ప్రతి ఏడాది ఏప్రిల్‌ 1వ తేదీ నుంచి అమలు చేస్తారు. అయితే ఈసారి సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కొత్త రేట్లపై నేషనల్‌ హైవే అథారిటీ ఎన్నికల సంఘం అనుమతి కోరింది. దీనిపై కొత్త రేట్లపై నిర్ణయం తీసుకోవాలని, అయితే ఎన్నికలైన తర్వాత మాత్రమే దానిని అమలు చేయాలని కేంద్ర రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖను ఆదేశించింది. సాధారణంగా ఇప్పుడు అమలవుతున్న టోల్‌ రేట్లకు 5 శాతం పెంచి కొత్త రేట్లను నిర్ణయిస్తుంటారు.

భూగోళానికీ ఓ బ్లాక్‌బాక్స్‌

- ఆస్ట్రేలియాలో నిర్మిస్తున్న శాస్త్రవేత్తలు
- ఈ సంవత్సరం చివరిలోగా పూర్తి
- వాతావరణ మార్పుల సమాచారాన్ని నిరంతరం రికార్డు చేయడమే లక్ష్యం

హోబర్ట్‌ (ఆస్ట్రేలియా), ఏప్రిల్‌ 1: వాతావరణ మార్పుల వల్ల భూగోళంపై మానవాళి అంతరించిపోతే ఆ తర్వాతి తరాలవారికి లేదా ఏదైనా గ్రహం నుంచి భూమిపైకి వచ్చినవారికి ఆ విషయం ఎలా తెలుస్తుంది? ఈ ప్రశ్నకు ఆస్ట్రేలియా శాస్త్రవేత్తలు సమాధానం చెప్తున్నారు. భూగోళం కోసం వారు ఓ బ్లాక్‌బాక్స్‌ను నిర్మిస్తున్నారు. 32 అడుగుల పొడవైన ఈ ఉక్కు స్థూపం వాతావరణ మార్పులకు సంబంధించిన వివరాలను నిరంతరం రికార్డు చేసి, భద్రపరిచేందుకు అవసరమైన హార్డ్‌డ్రైవ్‌లను కలిగి ఉంటుంది. భూగోళ మరణానికి దారితీసిన సంఘటనల గురించి ఈ బ్లాక్‌బాక్స్‌ తెలియజేస్తుంది. వాతావరణ మార్పుల వల్ల ఏదైనా పెను విపత్తు సంభవిస్తే దాన్ని నివారించడంలో మానవాళి ఎలా విఫలమైందో వివరిస్తూ ఓ నిస్పాక్షిక డాక్యుమెంట్‌ను అందిస్తుంది. ఈ బ్లాక్‌బాక్స్‌ చుట్టుపక్కల ఎవరైనా ఉన్నంత వరకు లేదా దాన్ని యాక్సెస్‌ చేయగలిగినంత వరకు ఆ డాక్యుమెంట్‌ను అందిపుచ్చుకోవచ్చు. స్టాన్లీ కుబ్రిక్‌ సైన్స్‌ ఫిక్షన్‌ చిత్రం '2001: ఏ స్పేస్‌ ఒడిస్సీ' లోని మిస్టీరియస్‌ మోనోలిత్‌కు సమానమైన ప్రకాశాన్ని ఈ బ్లాక్‌బాక్స్‌ కలిగి ఉంటుందని కళాకారులు చెప్తున్నారు. యూనివర్సిటీ ఆఫ్‌ టాస్మానియా సహకారంతో ఆస్ట్రేలియన్‌ మార్కెటింగ్‌ సంస్థ క్లెమెంజర్‌ బీబీడీవో ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును ముందుకు నడిపిస్తున్నది. వాస్తవానికి ఈ బ్లాక్‌బాక్స్‌ నిర్మాణం గురించి 2021 డిసెంబర్‌లోనే ప్రకటించారు. 2022 లోనే ప్రారంభం కావాల్సిన ఈ ప్రాజెక్టు వివిధ కారణాల వల్ల ఆలస్యమైంది. ఈ నేపథ్యంలో ఈ బ్లాక్‌బాక్స్‌ నిర్మాణాన్ని ఈ ఏడాది మొదలుపెట్టి ఈ ఏడాది చివరిలోనే పూర్తి చేయనున్నట్టు ఈ ప్రాజెక్టు చైర్‌పర్సన్‌, క్లెమెంజర్‌ బీబీడీవో ప్రొడక్షన్‌ హెడ్‌ సోనియా వాన్‌ బిబ్రా తెలిపారు. ఇందుకు అవసరమైన నిధులను సమకూర్చేందుకు దాతలు సిద్ధంగా ఉన్నప్పటికీ సంబంధిత దరఖాస్తును ఆస్ట్రేలియా పన్నుల శాఖ ఆమోదించాల్సి ఉన్నదని ఆమె వివరించారు. ఈ బ్లాక్‌బాక్స్‌ను నెలకొల్పే కచ్చితమైన ప్రాంతం ఏదో ఇప్పటికీ వెల్లడి కాకపోయినప్పటికీ ఆస్ట్రేలియా పశ్చిమ తీరానికి సమీపాన స్ట్రాహన్‌–క్వీన్స్‌టౌన్‌కు మధ్యలో దీన్ని ఏర్పాటు చేయవచ్చని తెలుస్తున్నది.

అరిజోనా అధికార గ్రహంగా ప్లూటో

అరిజోనా, ఏప్రిల్‌ 1: ప్లూటో గ్రహం తమ రాష్ట్ర అధికార గ్రహమని అమెరికాలోని అరిజోనా రాష్ట్రం ప్రకటించింది. అయితే 2006లో ఇంటర్నేషనల్‌ ఆస్ట్రానామికల్‌ యూనియన్‌ ప్లూటోను గ్రహం హోదా నుంచి తప్పించింది. మార్చి 29న అరిజోనా గవర్నర్‌ కేటీ హాబ్స్‌ ప్లూటో గ్రహాన్ని తమ రాష్ట్ర అధికారిక గ్రహంగా ప్రకటన చేస్తూ చట్టంపై సంతకం చేశారు. ప్లూటో అనేది పూర్తిస్థాయి గ్రహమా? కాదా? అని ప్రశ్నించినప్పుడు అంతరిక్ష ఆవిష్కరణల్లో అరిజోనా కృషికి తాను గర్విస్తున్నానని గవర్నర్‌ ప్రశ్నను దాటవేశారు. ప్లూటోను 1930లో అరిజోనాలోని ఫ్లాగ్‌స్టాఫ్‌లోని లోవెల్‌ అబ్జర్వేటరీలో ఖగోళ శాస్త్రవేత్త క్లైడ్‌ టోంబాగ్‌ గుర్తించాడు. అయితే ఈ చట్టానికి వ్యతిరేకంగా ఓటు వేసిన సాలీ ఆన్‌ గొంజెల్స్‌ మాట్లాడుతూ ప్లూటోను ఒక గ్రహం కాదని శాస్త్రీయంగా తేల్చేశారని, చట్టసభ సభ్యులు శాస్త్రీయ సమాచారాన్ని పరిగణనలోకి తీసుకోవాలని కోరారు.

టైప్‌-1 మధుమేహులకు శాకాహారమే మేలు!

న్యూఢిల్లీ: టైప్‌–1 మధుమేహ రోగులకు పండ్లు, కూరగాయలు, ధాన్యాలు, బీన్స్‌ వంటి తక్కువ కొవ్వు కలిగిన శాకాహార పదార్థాలు ప్రభావవంతంగా పనిచేస్తాయని శాస్త్రవేత్తలు తాజా అధ్యయనంలో గుర్తించారు. ఈ ఆహారంతో ఇన్సులిన్‌ అవసరం తగ్గి బాధితులు సమస్య నుంచి విముక్తి పొందుతారని వెల్లడించారు. ప్రస్తుతం టైప్‌–1 డయాబెటిస్‌ బాధితులకు క్రమం తప్పకుండా ఇన్సులిన్‌ ఇంజెక్షన్లు వేస్తుండాలి. తక్కువ కొవ్వు కలిగిన పదార్థాలు ఆ అవసరాన్ని దూరం చేస్తాయని అమెరికాలోని ఫిజీషియన్స్‌ కమిటీ ఫర్‌ రెస్పాన్సిబుల్‌ మెడిసిన్‌ పరిశోధకులు వెల్లడించారు. 58 మంది టైప్‌–1 డయాబెటిస్‌ వ్యాధిగ్రస్తులపై 12 వారాలపాటు చేసిన పరిశోధనల్లో ఆశాజనక ఫలితాలు వచ్చాయని వివరించారు.